# సిలికాన్ ఇసుక, క్వార్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించాలి

- కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్




గూడూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : సిలికాన్ ఇసుక, క్వార్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు కేటాయించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేసారు. శనివారం గూడూరు సబ్ కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ శ్రేణులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ఇద్దరు, ముగ్గురికే ఇసుక, క్వార్జ్ గనులు ఇస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఆర్థికంగాపైకి రావాలంటే ఎలా అని ప్రశ్నించారు. వాళ్ళను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, చిల్లకూరు మండలంలో వందల ఎకరాల్లో ఇసుక గనులు వుందన్నారు. అలాగే వెంకటగిరి సమీపంలో సైదాపురంలో క్వార్జ్ గనులు వుందని, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా వెంటనే స్పందించి ఇసుక, క్వార్జ్ గనులను ఎస్సీ, ఎస్టీ ఓబీసీ నిరుద్యోగ యువతకు ఇవ్వాలని డిమాండ్ చేసారు. చదువుకున్న బిడ్డలు ఎస్సీలలో, ఎస్టీల్లో, ఓబీసీల్లో చాలా మంది ఉన్నారు. సామాజిక న్యాయం గురించి చాలా మంది అసెంబ్లీలో మాట్లాడారు. ఇసుక, క్వార్జ్ గనులు కూడా అన్ని సామాజిక వర్గాలకు కేటాయించాలని, సామాజిక న్యాయం పాటించాలని కోరుతున్నాను. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా, లేక కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా, మాకు సంబంధం లేదు. మా ఎస్సీ ఎస్టీ ఓబీసీలకు ఇవ్వాల్సిందే. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 46లో అణగారిన వర్గాలు ఆర్థికంగా పైకి రావాలని వుంది. దాని ప్రకారం మేము గనులు అడుగుతున్నాని అన్నారు. త్వరలో 450 గనులు ఇవ్వబోతు న్నారు. అందులో సామాజిక న్యాయం ఖచ్చితంగా పాటించాలని అన్నారు. సిలికాన్ ఇసుక, క్వార్జ్ గనులే కాదు, బంగారు గనులు కూడా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, చందనమూడి శివ, పెంచులయ్య, దయాకర్, పూల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

# ప్రమోషన్ పొందిన ఎఎన్ఎంలతో...చెడుగుడు

- పొంతనలు లేని పదోన్నతులు, విధుల రిలీవింగ్ తేదీలు - పదోన్నతుల ఉత్తర్వులు 19న జారీ చేస్తే 15వ తేదీనే రిలీవ్ అయినట్లు ఎంపిడిఓల ఉత్తర్వులు



చిత్తూరు రూరల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త: పదోన్నతులు పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ ఎంలతో ఓ వైపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మరోవైపు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు చెడుగుడు ఆడుకుంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలు పదోన్నతులు పొందిన తేదీకి వారిని గ్రామ, వార్డు సచివాలయాల నుండి రిలీవ్ చేసిన తేదీలకు పొంతన కుదరకపోవడంతో దీని ప్రభావం జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో తమ సీనియార్టీపై పడనుందని ఫలితంగా తమకు తీవ్ర నష్టం కలుగనుందని పదోన్నతులు పొందిన పలువురు గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలు వాపోతున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీ ఎఎన్ఎం పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 298 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎఎన్ఎంలుగా విధులు నిర్వహిస్తున్న వారి సీనియార్టీ, విద్యను అనుసరించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పదోన్నతుల జాబితాను సిద్ధం చేసింది. ఈ నెల 10, 11వ తేదీలో జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి సమక్షంలో కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. మొదటి రోజు 150 మంది ఎఎన్ఎంలకు పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించగా రెండవ రోజు 148 మందికి నిర్వహించగా ఈ పదోన్నతుల్లో కొంతమందికి అనుకూలంగా పోస్టింగ్స్ ఇచ్చారని ఆరోపణలు వెల్లువెత్తడంతో 12వ తేదీ ఉదయం 9 గంటలకు డిఆర్ఓ ఛాంబర్‌లో 28 మంది ఎఎన్ఎంలకు మరోసారి పోస్టింగ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ పదోన్నతుల కౌన్సెలింగ్‌లో 5 మంది ఎఎన్ఎంల విద్యార్హతలపై అనుమానాలు వుండటంతో వీరి పోస్టింగ్‌లను వాయిదా వేశారు. అంటే 293 మంది గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలు పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరై పోస్టింగ్స్ తీసుకున్నారు. పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరై పోస్టింగ్స్ పొందిన ఎఎన్ఎంలకు అదేరోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాల్సి వుంది. మరుసటి రోజులైన ఆది, సోమవారాలు సెలవు రోజులు కావడంతో మంగళవారం రోజైన 15వ తేదీ పదోన్నతులు పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలకు పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేయాల్సి వుంది. అయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఈ నెల 19వ తేదీన పదోన్నతులు పొందిన గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలకు పోస్టింగ్ ఉత్తర్వులు అందజేశారు. అయితే కొంతమంది పలుకుబడి కల్గిన ఎఎన్ఎంలు తమకు 15వ తేదీనే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారని ఆ మేరకు రిలీవ్ చేయాలని చెప్పి 15వ తేదీని కొంతమంది ఎంపిడిఓల నుండి రిలీవ్ ఉత్తర్వులు తీసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అత్యధిక ఎఎన్ఎంలను ఈ నెల 19వ తేదీన రిలీవ్ చేసినప్పటికీ ఎంపిడిఓలు మాత్రం వీరు 15వ తేదీనే రిలీవ్ చేసివేయడంతో ఆ మేరకు అదే రోజు పదోన్నతులు పొంది ఎంపిక చేసుకున్న ప్రదేశాల్లో జాయినింగ్ రిపోర్టులను కొంతమంది ఇచ్చివేశారు. ఫలితంగా పదోన్నతులు పొందిన అత్యధిక గ్రామ, వార్డు సచివాలయ ఎఎన్ఎంలు జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో సీనియార్టీని కోల్పోనున్నారు. ఈ వ్యవహారంపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుంది.

# కనిపించని పోలీసులు మీరే!

-ట్యాక్సీ డ్రైవర్లు ఇచ్చే చిన్నసమాచారంతో పెద్ద ఉపద్రవం తప్పించవచ్చు -టిటిడి సివిఎస్ఓ హర్షవర్ధన్‌రాజు



ట్యాక్సీ డ్రైవర్లు, యజమానులతో అవగాహన సమావేశంలో పోలీసు ఉన్నతాధికారులు

తిరుమల,ఏప్రిల్ 25ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలక్షేత్రానికి యాత్రికులను తీసుకువచ్చే మీరే కనిపించని పోలీసులుగా సేవలందించాలని, ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, నేరస్తులుగా అనుమానం కలిగినా వెంటనే పోలీసులకుగానీ, పోలీసుకంట్రోల్‌రూమ్ 112కు గానీ సమాచారం అందించాలని టిటిడి సివిఎస్ఓ వి.హర్షవర్ధన్‌రాజు కోరారు. భక్తులపట్ల ప్రతి ట్యాక్సీడ్రైవర్ బాధ్యతగా, మర్యాదగా ప్రవర్తించినపుడు ఆ మంచిపేరు నలుదిశలా వ్యాపిస్తుందన్నారు. తిరుమల క్షేత్రాన్ని మరింతగా భద్రతతో నిఘా ఉంచేందుకు కీలకమైన ట్యాక్సీడ్రైవర్లు, యజమానులతో శుక్రవారం ఉదయం ఆస్థాన మండపంలో 500మందితో అవగాహన సమావేశం నిర్వహించారు. తిరుమల అదనపు ఎస్పీ ఐ.రామకృష్ణ, డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్ర, సదాలక్ష్మి, సిఐలు విజయకుమార్, రాముడు, హరిప్రసాద్, ఎంవిఐలు, విజిలెన్స్ అధికారులుతో కలసి సివిఎస్ఓ హర్షవర్ధన్‌రాజు అవగాహన సమావేశం జరిగింది. డ్రైవర్లు వ్యాపార ధోరణితో గాకుండా సేవాభావంతో మెలగాలన్నారు. భక్తులకు ఇబ్బంది కలిగిస్తే చూస్తూ సహించేదిలేదని గట్టిగా హెచ్చరించారు.

## చిత్తూరు జైలుకు మాధవరెడ్డి



చిత్తూరు కోర్టు ప్రాంగణంలో మాధవరెడ్డి

చిత్తూరుటౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :మదనపల్లె ఆర్డిఓ కార్యాలయంలో రికార్డులు దగ్ధం కేసుకు సంబంధించి నిందితుడు మాధవరెడ్డిని సిబిసిడి పోలీసులు శుక్రవారం సాయంత్రం చిత్తూరు జిల్లాకు తరలించారు. ఏడు నెలల క్రితం మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అర్ధరాత్రి పూట రికార్డులు దగ్ధమైన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరుడు మాధవరెడ్డికి ఈ దగ్ధంతో సంబంధం ఉందని పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం ప్రభుత్వం ఈ కేసును సిబిసిడి కి బదిలీ చేసింది. ఈ ఘటన సంబంధించి మాధవరెడ్డిని తిరుపతి సిబిసిఐడి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. మాధవరెడ్డిని శుక్రవారం సాయంత్రం చిత్తూరులోని సిబిసిఐడి అధికృత న్యాయస్థానం (నాలుగవ అదనపు మ్యాజిస్ట్రేట్ కోర్టు)లో హాజరు పరిచారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి తరఫున న్యాయవాదులు ఆయనకు బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. సిబి సిఐడి న్యాయవాది ఆయన బెయిల్ దరఖాస్తును వ్యతిరేకించారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈసమయంలో మాధవరెడ్డికి బెయిల్ మంజూరు చేస్తే ఆయన దర్యాప్తుకు ఆటంకం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో సిబిసిడి కోర్టు న్యాయమూర్తి బాబా జాన్ బెయిల్ దరఖాస్తును తిరస్కరించారు. మాధవరెడ్డికి రిమాండ్ విధించడంతో ఆయనను సిబిసిడి పోలీసులు చిత్తూరు జైలుకు తరలించారు.

# ఇజ్రాయిల్ టెక్నాలజీ తెచ్చింది చంద్రబాబే : ప్రభుత్వ విప్



రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్

కుప్పం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : భారత దేశంలోనే తొలిసారిగా కుప్పానికి ఇజ్రాయిల్ టెక్నాలజీ తెచ్చింది సిఎం చంద్రబాబు నాయుడేనని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయశాఖ అధ్వర్యంలో రైతులకు వ్యవసాయ యాంత్రీ కరణ పథకంలో భాగంగా వివిధ రకాల పని ముట్లను ఆయన ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నంతో కలసి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ విప్ కంచర్ల మాట్లాడుతూ కుప్పంలో ఒకప్పుడు రాగులు, సజ్జలు తదితర పంటలు సాగు చేసేవారన్నారు. కుప్పంలో సిఎం చంద్రబాబు హరిత విప్లవం తెచ్చారన్నారు. నేడు కుప్పం ప్రాంతం వ్యవసాయ, ఉద్యానవన, పట్టు తదితర పంటలసాగులో ముందుకుసాగుతోందన్నారు. సిఎం చంద్రబాబు చొరవతో జిల్లాలోనే కుప్పం పాల ఉత్పత్తిలో మొదటి స్థానంలో ఉందన్నారు. ఇక్కడ మరింత పాల ఉత్పత్తులు పెంచేందుకు పాడి ఆవులకు కృత్రిమ గర్భధారణ కింద పేయ దూడ(ఆడదూడ)లకు జన్మనిచ్చే ఇంజక్షన్లు సైతం ఉచితంగా పైలెట్ ప్రాజెక్ట్ కింద వేయడం జరుగుతోందన్నారు. కుప్పంలో ఉద్యానవన పంటల సాగులో సైతం ముందున్నామన్నారు. ఇక్కడి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి స్కోచ్ అవార్డు సాధించిందన్నారు. గత వైఎస్సార్సీ పాలనలో వ్యవసాయ రంగాన్ని నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో పార్టీలకతీతంగా సిఎం చంద్రబాబు రైతులకు, ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అధికారులు కూడా ప్రభుత్వపరంగా రైతులకు అందే పథకాలు, రాయితీలపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఎఒ ఫయాజ్ బాషా, ఎఇఒ ఔరంగ్, మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మాజీ సర్పంచులు రామచంద్ర, సంజీవి, తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, నడిమూరు సర్పంచ్ సంతోష్, నేతలు రాజా, వసంతమ్మ, విఎఎలు పాల్గొన్నారు.

## ప్రయోగాల పేరుతో దూరమవుతున్న విద్య : ఎస్‌టియు

తొట్టంబేడు, ఏప్రిల్ 25ప్రభాతవార్త:ప్రయోగాల పేరుతో విద్యార్థులకు పాఠశాల విద్య దూరమవుతోందని ఎస్‌టియు రాష్ట్ర నేత గాజుల నాగేశ్వరరావు అన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన బాలుర ఉన్నత పాఠశాలలో ఎస్‌టియు శ్రీకాళహస్తి డివిజన్‌శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాష్ట్ర నాయకులు గాజులనాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్యం అవుతోందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంస్కరణల పేరుతో పాఠశాల విద్యలో ప్రయోగాలతో పేద విద్యార్థులకు విద్యను ప్రభుత్వాలు దూరం చేస్తున్నాయని గాజుల నాగేశ్వరరావు తెలిపారు. జిల్లా అధ్యక్షులు రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తిరుపతి జిల్లా ప్రథమ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వం 117 జీవో పేరుతో ఉన్న పాఠశాలలకు మూడు నాలుగు ఐదు తరగతులు విలీనం చేసి దేశం ఎక్కడా లేని విధంగా 3,4,5 తరగతులకు సబ్జెక్టు టీచర్లతో ప్రత్యేకంగా బోధన అంటూ చేపట్టినప్రయోగం పూర్తిగా విఫలం అయిన విషయం తెలిసిందేనన్నారు. ఒకటి, రెండు తరగతులతో ప్రాథమిక పాఠశాలలు బోసిపోయి గ్రామాల్లో విద్యార్థులు ప్రైవేటు బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షులు గంటా మోహన్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించఆల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌ఛార్జి ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ 12వ పిఆర్సీ అమలయ్యేలోపు ఐఆర్ ప్రకటించేలా చొరవ చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.జగన్నాథం నాయుడు మాట్లాడుతూ ఉపాధ్యాయ వివరాలను సేకరించడంలో విద్యాశాఖ పలుమార్లు ఉపాధ్యాయులను ఇబ్బందలకు గురిచేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్లు చిర్రి హరికృష్ణ, గురుప్రసాద్, రామాంజ నేయుడు, రమేష్‌బాబు, మోడల్ స్కూల్ ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి, ఎస్‌టియు డివిజన్ కన్వీనర్లు వాసు, సుధాకర్, మంచినీళ్ళ వెంకటరమణ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, పెరిమిడి జిల్లా అధ్యక్షుడు మునికృష్ణమనాయుడు, మాజీ ప్రధాన కార్యదర్శియువ శ్రీమురళీ, కార్యదర్శి రేణుకాదేవి, శారద, ద్రాక్షాయని, రమాదేవి,జ్యోతి, సభ్యులు శ్రీనివాసులు, గుమ్మడి మురళీ, కృష్ణయ్య, శ్యామసుందర్, ఆదిశేషయ్య,రవికుమార్, మురళీ, మధుసూధన్‌రాజు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రాకెట్ల ప్రయోగాలుతో శ్రీహరికోటకు గుర్తింపు తెచ్చిన

# కస్తూరి రంగన్ కన్నుమూత

- షార్‌లో విషాదం - శ్రీ హరికోట అభివృద్ధికి కృషి చేసిన శాస్త్రవేత





కస్తూరి రంగన్‌కు శ్రద్ధాంజలి ఘటిస్తున్న సార్ కంట్రోలర్



అప్పటి ప్రధానమంత్రి వాజ్‌పాయ్‌తో రంగరాజన్

శ్రీహరికోట (తడ), ఏప్రిల్ 25 ప్రభాతవార్త : అంతరిక్ష ప్రయోగాలలో ఎన్నో సవాళ్ల ఎదుర్కొని స్వదేశి పరిజ్ఞానాన్ని వినువీధిలో రెపరెపలాడించిన కస్తూరి రంగన్ ఇక లేరు.. 10 ఏళ్ల పాటు భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చైర్మన్‌గా ఉన్న కస్తూరి రంగన్ శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రానికి ఎంతో మేలు చేసారు. షార్ అభివృద్ధికి ముఖ్య కారకుల్లో ఆయన ఒక్కరు. శ్రీహరికోటకు సూళ్ళూరుపేట పట్టణం ఒక ప్రవేశ ద్వారంగా ఉంటుంది. ఇక్కడ విద్యాభివృద్ధికి ఆయన చొరవ చూపించారు. అప్పటి సార్ డైరెక్టర్ కె. నారాయణ కూడా సూళ్ళూరుపేట వాసి కావడంతో వీరి కలయికలో ఇక్కడ కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి నిధులు వెచ్చించారు. శివలింగం శెట్టియార్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కూడా అప్పట్లో షార్ యాజమాన్యం సహకరించింది. సూళ్ళూరుపేట శ్రీహరికోట మార్గంలో రైల్వే వంతెన అభివృద్ధికి అప్పట్లోనే కృషి చేసారు. ఇస్రో ప్రయోగాలు అభివృద్ధి చెందడానికి మౌళిక సదుపాయాలు, రహదారులు, విద్యుత్‌తో పాటు మంచి నీటి సరఫరా వంటివి కస్తూరి రంగన్ చైర్మన్‌గా ఉన్నప్పుడు శ్రీహరికోటకు పుష్కలంగా అందించారు. ఈ కారణంగా ఆయన పేరు సూళ్ళూరుపేట, శ్రీహరికోటలలో చెరిగిపోని సంతకంగా మారింది. ఇస్రో చైర్మన్‌గా చిన్న రాకెట్ల నుండి భారీ రాకెట్ల దాక ఆయన ఆధ్వర్యంలో సార్ నుంచి ప్రయోగించబడ్డాయి. ఒక ఎస్ఎల్‌వితో పాటు మరెన్ని పిఎస్ఎల్‌విలు, ఒక జిఎస్ఎల్‌వి రాకెట్లు కూడా ప్రయోగించారు. రాకెట్ల ప్రయోగాలు పెరగడంతో శ్రీహరికోటకు గుర్తింపు వచ్చింది. సహజంగానే కేరళ వాసులు శాస్త్రవేత్తలుగా ఎప్పటికప్పుడు తమ ప్రతిభ పాఠవాలు ప్రదర్శిస్తుంటారు. కస్తూరి రంగన్ కూడా కేరళవాసి. బొంబాయి, అహ్మదాబాదులో డిగ్రీ, పోస్టుగ్రాడ్యువేషన్‌ను పూర్తి చేసుకుని అప్పట్లోనే డాక్టరేట్‌ను పొందారు. భారతియ తొలి ఉపగ్రహం ఆర్యభట్ట నుండి ఆయన ఆధ్వర్యంలో ఎన్నో ఉపగ్రహాలు, రాకెట్లు, రూపొందించబడ్డాయి. పుస్తకాలు ఎక్కువ చదివే కస్తూరి రంగన్ కనీసం 200లకు పైగా పరిశోధన వ్యాసాలు రాసారు. పలు జాతీయ, అంతర్జాతీయ పత్రికలలో ఇవి ప్రచురితమైయ్యాయి. కస్తూరి రంగన్ మృతి పట్ల శుక్రవారం షార్‌లో సంతాప సభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. షార్ కంట్రోలర్ ఎం. శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ డైరెక్టర్‌లు గోపి కృష్ణ, శంకరన్, సీనియర్ శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు. రంగన్ మృతి పట్ల రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## రాజనాలబండపై ఆగిన టెండర్లు : అనుమతుల్లేవంటున్న అధికారులు



ఆలయానికి చెందిన మామిడి చింతచెట్లు

చౌడేపల్లి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాలబండపై టిటిడి సీతకన్ను వేసిందా...యేటా లక్షలాదిగా వస్తున్న ఆదాయాన్ని విస్మరిస్తున్నారా...అంటే ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఔననే అంటున్నారు...ప్రతి సంవత్సరం ఆలయ భూములను, ఫలసాయాలపై టెండర్లు వేసే అధికారులు అనుమతుల పేరుతో మీనమేషాలు వేషాలు వేస్తున్నారన్న విమర్శలు న్నాయి. రెండేళ్ళ క్రితం రాజనాల బండను దేవా దాయధర్మాదాయశాఖ నుంచి టిటిడి వారు స్వాధీన పరచుకొన్నారు. అప్పటి నుంచి ఆలయంలో టిటిడి పద్ధతుల్లోనే స్వామివారికి కైంకర్యాలు, తిరుణాళ్ళు వంటివి జరుగుతున్నాయి. రాజనాలబండ ఆలయానికి దాదాపు 20ఎకరాల పొలాలతోపాటు 5.50 ఎకరాల మామిడి, మరో 8 చింతచెట్లు వున్నాయి. గతేడాది టిటిడి రెవిన్యూ అధికారుల ఆధ్వర్యంలో టెండర్ల ప్రక్రియ జరిగింది. అయితే ఈ దఫా టెండర్లు పెట్టలేదు. భూమి మాట అటుంచితే మామిడి, చింత ఫలసాయం మాటేమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. 5నెలల క్రితం జరగాల్సిన టెండర్లు ఇప్పటి వరకు వాటి ఊసే ఎత్తేవారు కనబడలేదని వారంటున్నారు. గతేడాది చింతకు రూ. 20వేలు, మామిడి ఫలసాయానికి రూ. 2లక్షల వరకు టెండరు ఖరారు అయ్యింది. అయితే ఈ సారి మామిడి దిగుబడి ఆశాజనికంగా వుంది. ఫల సాయంపై టెండరుకు పిలువక పోవడంతో ఎవరు కోయాలన్న సందిగ్ధ పరిస్థితుల్లో స్థానికులున్నారు. చింత ఇప్పటికే పరులపాలైందనీ, టిటిడి వెంటనే స్పందించి మామిడి ఫలసాయానికి టెండరు పెట్టాలని రైతులు కోరుతున్నారు. లేనట్లైతే మామిడి సైతం నేలపాలవుతుందని వారంటున్నారు.

**ఉన్నతాధికారుల అనుమతి లేదు :** రాజనాలబండ ఆలయానికి వున్న మామిడి, చింత, సాగు భూములకు సంబంధించి టెండర్ల ప్రక్రియ జరపలేదని టిటిడి తహశీల్దార్ లలితాంజలి అన్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాల వచ్చిన వెంటనే టెండర్లు పిలుస్తామని ఆమె వివరణ ఇచ్చారు.

## అట్టహాసంగా మెక్సోడియా జాతీయ సదస్సు ప్రారంభం




కోట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మెకానికల్ విభాగంలో శుక్రవారం మెక్సోడియా జాతీయస్థాయి సదస్సు అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ కుమార్‌రెడ్డి, ముఖ్య అతిథి టాటా ఎల్క్సీ లిమిటెడ్ (ఆటోమోటివ్ ఇంజినీర్) నాగార్జున సుంకం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగార్జున సుంకం మాట్లాడుతూ దేశంలో మెకానికల్ ఇంజినీర్ల భవిష్యత్తు బంగారు బాటగా పేర్కొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆధునిక సాంకేతికత వైపు శరవేగంతో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులకు రాష్ట్రంలోని పలు కళాశాల విద్యార్థులు ఒకేచోటకు చేరుకోవడంతో వారిలో దాగి ఉన్న సాంకేతిక నైపుణ్యాలను పంచుకోవచ్చని అన్నారు. ఇలాంటి సదస్సులను తమ కళాశాలలో అనేక సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం పేపర్ ప్రజంటేషన్, పోస్టర్ ప్రజంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో, స్పాట్ ఈవెంట్లు నిర్వహించారు. విజేతలకు విజయకుమార్‌రెడ్డి చేతులు మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, మెక్సోడియా కన్వీనర్ డాక్టర్ ఎం.మధుసూదన్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కనుమరుగైన పచ్చదనం...

# హరితాభివృద్ధి మాయం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 25 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలన కేవలం నాలుగుగోడల మధ్యకే పరిమితమౌతుంది. రాహుకేతుదోష నివారణ పూజలకు ఎంత మంది వస్తున్నారు, ఎంత ఆదాయం వస్తుందనే పరిశీలనలు తప్ప అనుబంధంగా ఉన్న ఆలయాలు, వనరుల పరిస్థితి ఏమిటన్నది పట్టించుకునే దిక్కులేదు. ఇక్కడ డెప్యూటి ఇఒ ఎంతోకాలంగా పని చేస్తున్నారు. ఆయనకు అనుబంధ ఆలయాలు, లోబావికి సంబంధించి చక్కటి అవగాహన ఉన్నా, ఇఒతో పాటు ఆయన ఆలయానికే పరిమితమయ్యారు.

శ్రీకాళహస్తీశ్వరాలయం సారధ్యంలో 2000 సంవత్సరంలో హరితాభివృద్ధి పథకాన్ని అమలు చేసారు. అప్పటిలో కైలాసగిరుల్లో పచ్చదనానికి టేకు చెట్లను శ్రీగంధం చెట్లను కొండలపై ఎపెంచారు. ఫలసాయాన్నిచ్చే వృక్షాలను గ్రామాల్లో పెంచారు.లోబావిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దారు.నాడు పట్టణ వాసులంతా ఇక్కడ ఏర్పాటు చేసిన చక్కటి పార్కుకు తండోపతండాలుగా వచ్చేవారు. చక్కటి పచ్చిక బయళ్ళను ఏర్పాటు చేసారు. కానీ నేడు పట్టించుకునే దిక్కులేక పచ్చదనం కనుమరుగైంది. పచ్చటి చెట్ల జాడ లేదు, ఈ ప్రాంతమంతా ఎడారిని తలపించే రీతిలో మారింది. హరితాభివృద్ధిలో నియమించబడిన సిబ్బంది ఎవరి పలుకుబడి ఉపయోగించి, ఆలయంలో తిష్టవేసారు. అడవిని రక్షంచాల్సిన సిబ్బంది ఆలయంలో అక్రమ సంపాదనలకు పరిమితమయ్యారు. దీనిపై అధికారులు ఎందుకు దృష్టిపెట్టరనే విమర్శలు చోటు చేసుకున్నాయి.

**లోబావిలో రంగుమారుతున్న నీరు:**




శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న లోబావి లో సరస్సునందు ఇందులో చేపలు, తాబేళ్లు ఉన్నాయి. ఇక్కడ పర్యవేక్షణ కొరవడ డంతో దాంతో ఇక్కడకు వేకువ జామున వచ్చే భక్తులు లోబావిలో స్నానమాచరించి బట్టలను వదలి పెడుతున్నారు. దాంతో తాంబేళ్ళ కాళ్ళకు తగులు కొని ఈద లేక మృత్యువాత పడుతున్నాయి. వాటిని చేపటలు తినటంతో నీళ్ళు నీసు వాసన చోటు చేసుకుంటుంది. ఇటీవల ఓ 50కిలోల తాబేలు చనిపోతే ఓ రిటైర్డ్ ఉపాధ్యాయుడు వాకర్ దానిని తీసి దూరంగా పారవేశారు. ఇక లోబావిలో బట్టలు వదలి పెట్టడం, చెత్తా చెదారం నిండి చూడటా నికి అసికంగా ఉంది.దీనికి తోడు చెత్తలు నిండాయి. ఇక లోబావిలో నీళ్ళు రంగుమారి దర్శన మిస్తున్నాయి. ఇక్కడ భద్రత మాట దేవుడెరుగు పర్యవేక్షణ కొరవడటంతో పవిత్రమైన భరద్వాజ తీర్థం కలుషితంగామారింది. మరి ఇవ్వన్ని ముక్కంటీశుడే పరిరక్షించుకోవాలేమో?

## ఎర్రచందనం స్మగ్గరుకు 5ఏళ్ల జైలు శిక్ష

- రూ. 3లక్షలు జరిమానా విధించిన న్యాయమూర్తి

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త : ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడిన స్మగ్లరుకు ఆర్ ఎస్ ఎస్ ఏ డీజే కోర్టు న్యాయమూర్తి నరసింహామూర్తి ఐదేళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు, రూ.3లక్షలు జరిమానా విధించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ అమలులో భాగంగా ఎస్పీ పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కోర్టులో పకడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి శిక్ష పడేవిదంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 142/2022 కేసులో తిరుపతి టీఎన్ పాళెం బీటు పరిధిలో పట్టుబడ్డ చిత్తూరు సంతపేటకు చెందిన సెల్వంకు న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3లక్షల జరిమానా విధించారు. నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. దీనిపై ఎస్పీ గారు మాట్లాడుతూ శేషాచలం రిజర్వు ఫారెస్ట్ లోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరకడమే కాకుండా, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే వారికి హెచ్చరిక అని తెలియజేశారు.

